## క్లుప్తంగా

### పారిశుధ్య కార్మికులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

**పెదగంట్యాడ:** ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ సచివాలయ ఆవరణలో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అనంతరం పరీక్షలు నిర్వహించిన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పార్లమెంట్ సాక్షిగా ప్రకటన చేయాల్సిందే



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

**అగనంపూడి:** విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని పార్లమెంట్ సాక్షిగా ప్రకటన చేయాల్సిందేనని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో 1,335వ రోజు కూర్మన్నపాలెం రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తామని, వంద శాతం రివైవల్ ప్యాకేజీ ప్రకటించాలని, విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, నిర్వాసితులందరికీ శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మసేనురావు, సుబ్బయ్య, ఎన్.వీ.శయనబాబు, బీఎంఎల్ నాయుడు, బి.వి.సత్యనారాయణ, పరంధామయ్య, డేముడు, మాతా గోవింద్ పాల్గొన్నారు.

### ఘనంగా అన్న సమారాధన



భక్తులకు అన్నం వడ్డిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

**పెదగంట్యాడ:** దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని గొందేశి వీధిలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద మంగళవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రయానికి వైఎస్సార్ సీపీ గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గొందేశి సుమన్‌రెడ్డి, బసా అప్పలరెడ్డి, నీలాపు ప్రకాష్ రెడ్డి, బసా అప్పారావు, గొందేశి రమేష్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

### విరాళాల అందజేత



చెక్కులను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అందజేస్తున్న శివరామకృష్ణయ్య

**అక్కిరెడ్డిపాలెం:** బీహెచ్‌పీవీ విశ్రాంత ఉద్యోగి శివరామకృష్ణయ్య, శ్యామలా దేవి దంపతులు రాజధాని నిర్మాణానికి రూ.1 లక్షను, విజయవాడ వరదబాధితుల సహాయార్థం మరో రూ.1 లక్ష చెక్కులను విరాళంగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అందజేశారు. మంగళవారం ఆటోనగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ క్వార్టర్స్‌లో ఆయన నివాసంలో ఎమ్మెల్యేకు రెండు లక్షల చెక్కులను అందజేశారు.



# వ్యాయామం.. ఆరోగ్యం.. ఆనందం

## అందరిలో ఫిట్‌నెస్‌పై పెరుగుతున్న శ్రద్ధ

- జిమ్‌లకు క్యూ కడుతున్న జనం
- నడక, యోగా, ధ్యానం పై పెద్దలు ఆసక్తి
- కరాటే, బాక్సింగ్ పై చిన్నారుల మోజు



వుడా కాలనీ ప్రగతి పార్కులోని ఓపెన్ జిమ్‌లో వ్యాయామం

**పెదగంట్యాడ:** అప్పుడే తెలతెలవారుతోంది..సూరీడు మెల్లగా ఉదయిస్తున్నాడు. కోడి కూసి కొద్దిసేపే అయినా..అప్పటికే పెదగంట్యాడ మండలంలో జనాలు మాత్రం దినచర్య ప్రారంభించేశారు. రహదారులు, పార్కుల్లో సందడి మొదలైంది.. మధ్య వయసువారు జాగింగ్, వృద్ధులు వాకింగ్, యువత జిమ్‌లో కుస్తీలు పడుతుంటే, మహిళలు యోగా, ధ్యానం చేస్తూ కనిపిస్తున్నారు. ఇక చిన్నారులు, యువతులు కరాటే, బాక్సింగ్ ట్రైనింగ్‌తో బిజీబిజీ..ఇలా అన్ని వర్గాల వారు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ మిగిలిన వారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నిత్యం రకరకాల వ్యాపకాలతో.. ప్రతి వ్యక్తి క్షణం తీరిక లేకుండా గడుపుతున్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో తరచూ ఆరోగ్య సమస్యలు తలెత్తడం.. వాటి వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవడం పరిపాటిగా మారింది. వీటి నుంచి బయట పడడానికి వ్యాయామం, యోగ, ధ్యానం,కరాటే, బాక్సింగ్, వాకింగ్ వంటి శారీరక శ్రమ చేయడం ఎంతగానో దోహదపడుతోంది.



యోగా చేస్తున్న, మహిళలు, పురుషులు

### పెరిగిన జిమ్‌లు

పెదగంట్యాడ మండలంలో సుమారు 50 నుంచి 60 వరకూ జిమ్‌లు ఉన్నాయి. ప్రతి జిమ్‌కు రోజుకు 120 నుంచి 160 మంది వరకూ వ్యాయామం కోసం వస్తుంటారు. అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుల్లో కూడా వాకింగ్, జాగింగ్, యోగ, ధ్యానం కోసం వందల మంది వస్తుంటారు. మండలంలో గాంధీ పార్కు, ఇండోర్‌స్టేడియం,ఆదర్శ గ్రౌండ్, అమరావతి పార్కు, ప్రగతి పార్కు,అయ్యన్నపాలెం పార్కుచ హౌసింగ్ బోర్డు పార్కుల్లో వాకింగ్, జాగింగ్, వ్యాయామం చేస్తూ ఉంటారు.



ధ్యానం చేస్తున మహిళలు

### ఆరోగ్యం మీ సొంతం



క్రమం తప్పకుండా నడవడం, వ్యాయా మం వంటివి చేయడంతో శరీర బరువుతో పాటు కొలెస్ట్రాల్, బీపీ, షుగర్ వంటివి నియంత్రణలో ఉంటాయి. ఫలితంగా గుండె జబ్బులు, గుండెపోటుకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది.

–డాక్టర్ రమేష్‌బాబు, వైద్యాధికారి, పెదగంట్యాడ

### బోలెడు లాభాలు



వ్యాయామం చేయడం వల్ల వంట్లో ఉన్న కొవ్వు కరగడంతో పాటు బాడీ ఫిట్‌గా ఉంటుంది. అలాగే రోగాలు కూడా దరిచేరవు. యువత జిమ్ చేస్తూ క్రీడల్లో పాల్గొడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

–గొందేశి రాము, జిమ్ కోచ్, హౌసింగ్‌బోర్డు కాలనీ

### యోగా,ధ్యానంతో మానసిక ప్రశాంతత



రోజూ యోగ, ధ్యానం చేయడం వలన మానసిక ప్రశాంతత, శరీరానికి శక్తి లభిస్తుంది. ఉరుకులు పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఒత్తిళ్లకు గురవుతున్నారు. యోగా, ధ్యానం చేస్తే ఒత్తిడి నుంచి జయించవచ్చు. అంతేకాకుండా దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుతాయి. యోగా అనేది మనస్సు, శరీరం, మనిషి ప్రకృతి,వ్యక్తిగత స్పృహ, సార్వత్రిక సామరస్యాన్ని తీసుకువచ్చే కళ..

–మీసాల శివ గణేశ్వరరావు, యోగా గురువు

### బరువు తగ్గా..



నేను ఎక్కువ బరువుతో ఇబ్బందిపడేవాడ్ని. ఎక్కడికైనా బయటకు వెళ్లాలంటే చిన్నబోయి నట్టు ఉండేది. కొన్ని నెలలుగా రోజు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తున్నాను. దీంతో బరువు బాగా తగ్గాను. దీంతో రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.

–కొండకంచి రాజు, నడుపూరు

## నిలిచిపోయిన పనులకు టెండర్లు పిలవాలి



ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్‌లో నిలిపి వేసిన పనులకు వెంటనే టెండర్లు పిలవాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉక్కు హిల్‌టాప్ జంక్షన్ వద్ద ధర్నా చేయారు. కాంట్రాక్ట్ కార్మికులు తమకు పనులు కల్పించాలంటూ నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ కొన్ని విభాగాల్లో పనులు నిలిచిపోయి నెలలు తరబడి కొత్త టెండర్లు పిలవటం లేదన్నారు. దాని వల్ల కాంట్రాక్ట్ కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. అదే విధంగా కొన్ని విభాగాల్లో కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించడం లేదన్నారు. తద్వారా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల పరిస్థితులను అర్థం చేసుకుని కొత్త టెండర్లు పిలిచి కాంట్రాక్ట్ కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు మంత్రి రవి, పి.వి. రమణమూర్తి, నమ్మి రమణ, ఎల్. సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి

**అగనంపూడి:** జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలోని వాకింగ్ ట్రాక్‌ను చదును చేయడంతోపాటు గ్రౌండ్‌ను కూడా శుభ్రంచేసి వాటిలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, విద్యుద్దీకరణ చేపట్టాలని, చుట్టూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు, 79వ వార్డు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనక భవానీ, వెంకటరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి జీవీఎంసీ నిధులు విడుదల చేసేలా కృషి చేయాలని వారు కోరారు.

## జీతాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికుల ధర్నా

**గాజువాక:** తమకు రావాల్సిన జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ.. ప్రతినెలా ఏదో ఒక వార్డులో పారిశుధ్య కార్మికుల జీతాలు మిస్ అవుతున్నాయని పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం కార్పొరేటర్ల ద్వారా ఏడాది క్రితం నియమించిన డే అండ్ నైట్ పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించడంలేదన్నారు. దసరాకైనా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నక్క నాగరాజు, సోమాదుల గణేష్, సత్యవతి, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

# ఘనంగా దసరా సంబరాలు



పోటీలో గెలుపొందిన విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్



నృత్య ప్రదర్శనతో అలరించిన విద్యార్థులు

**అగనంపూడి:** దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. అలాగే వివిధ దేవతామూర్తుల ఆకృతుల తయారీ, రంగోలి, ర్యాంప్ వాక్, దాండియా, వివిధ నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం రావణ దహనం కార్యక్రమం చేపట్టారు. వివిధ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనలు చేసిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ వి.మధుసూధనరావు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా ఈ ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం



ఏయూ రిజిస్ట్రార్‌కు డీడీని అందజేస్తున్న కరస్పాండెంట్ ఉమా మహేశ్వరరావు

**గాజువాక :** స్థానిక టీఎస్సార్, టీబీకే కళాశాల యాజమాన్యం వరద బాధితుల సహాయం కోసం సీఎం సహాయ నిధికి రూ.2 లక్షల విరాళాన్ని అందజేసింది. డీడీని కళాశాల కరస్పాండెంట్ టి.ఉమామహేశ్వరరావు ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావుకు మంగళవారం అందజేశారు.

## గాజువాక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ



గాజువాక పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

**అక్కిరెడ్డిపాలెం:**గాజువాక పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు రాజీపడొద్దని సూచించారు. కార్యక్రమంలో గాజువాక సీఐ, ఎస్ఐతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రౌండ్‌ను వీడని విఘ్నాలు



వుడా కాలనీలోని ఆదర్శ గ్రౌండ్



పనులు నిలిచిపోవడంతో వృథాగా మెటీరియల్

- ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేసిన జీవీఎంసీ
- ప్రైవేట్ స్కూల్‌ను తరలించిన తరువాతే పనులు చేపట్టాలన్న టీడీపీ నాయకులు?
- అభ్యంతరాల పేరుతో పనులను నిలిపివేసిన అధికారులు

**గాజువాక :** స్థానిక వినాయకనగర్ (వుడా కాలనీ)లోని ఆదర్శ గ్రౌండ్ అభివృద్ధికి విఘ్నాలు ఎదురవుతూనే ఉన్నాయి. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా జీవీఎంసీ నుంచి నిధులొచ్చినా అభ్యంతరాల పేరుతో అధికారులు పనులను నిలిపివేశారు. 73వ వార్డు పరిధిలో ఉన్న ఈ గ్రౌండ్ అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో జీవీఎంసీ రూ.5 కోట్ల నిధులను మంజూరు చేసిన విషయం తెలిసిందే. నాలుగు బ్యాడ్మింటన్ కోర్టులతో ఇండోర్ స్టేడియంతోపాటు అడ్మిన్ రూమ్, జిమ్ రూమ్, టాయ్‌లెట్లు వంటి సౌకర్యాలతో ఈ నిధులతో పనులను చేపట్టేందుకు ఈ ఏడాది మార్చి 14న అప్పటి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ అధికారులు రూపొందించిన ప్రణాళిక ప్రకారం పనులను కూడా చేపట్టారు. ఆ వెంటనే జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఈ పనులకు మళ్లీ ఆటంకం ఏర్పడింది. పనులను ఆపాలని కూటమి నాయకులు జీవీఎంసీపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. అందువల్లే పనులను నిలిపివేసినట్టు జీవీఎంసీ వర్గాలు పేర్కొంటున్నాయి.

### ఇద్దరు కార్పొరేటర్ల పెత్తనం?

ఈ గ్రౌండ్‌లో పనులను నిలిపివేయడంలో ఇద్దరు టీడీపీ కార్పొరేటర్లు కీలకపాత్ర వహిస్తున్నట్టు తెలిసింది. ఈ పనులను రూ.50 లక్షల చొప్పున విభజించి ఇద్దరు కాంట్రాక్టర్లకు అప్పగించారు. వారిలో ఒక కాంట్రాక్టరు ఇద్దరు కార్పొరేటర్లకు సన్నిహితుడిగా చెబుతున్నారు. మొత్తం పనిని ఒకే కాంట్రాక్టరుకు అప్పగించే ప్రయత్నంలో వారిద్దరూ ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో తాము చెప్పిన విధంగా పనులను నిర్వహించాలని వారు పట్టుపడుతున్నట్టు సమాచారం. అయితే, ఆ వార్డుకు తాను ప్రాతినిధ్యం వహిస్తున్నందున తన సూచనలను పరిగణించి పనులను చేపట్టాలని 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత కోరుతున్నప్పటికీ టీడీపీ నాయకుల ఒత్తిడి కారణంగా అధికారులు పట్టించుకోవడంలేదు.



గత ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకం

### పాఠశాల తరలింపు సాధ్యమేనా?

ఐదెకరాల స్థలం వున్న ఈ మైదానంలోని ఎకరంనర స్థలంలోగా షాపింగ్ కాంప్లెక్స్‌ను గతంలో వుడా అధికారులు ఒక పాఠశాలకు లీజుకు ఇచ్చారు. ఇంత పెద్ద మైదానం పట్టణం నడిబొడ్డున ఉండటంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినప్పటికీ ప్రైవేట్ పాఠశాల కొనసాగుతుండటంతో ఆ మేరకు స్థలం కుదించుకుపోయింది. దీన్ని తరలించాలని 2009నుంచి అటు వుడా అధికారులు, ఇటు ప్రభుత్వ ప్రతినిధులు ప్రయత్నిస్తున్నప్పటికీ విఫలమవుతున్నారు. తమకు ప్రత్యామ్నాయ స్థలం ఇస్తే తప్ప ఖాళీ చేయడం కుదరదని పాఠశాల యాజమాన్యం స్పష్టం చేయడంతో కొంతకాలం పాటు అధికారులు చేతులెత్తేశారు. ఈ మైదానానికి సమీపంలో ఉన్న 60 సెంట్ల ప్రభుత్వ ఖాళీ స్థలంలోకి తరలించాలని అధికారులు ప్రతిపాదించారు. అందులో తమకు భవనాన్ని నిర్మించి ఇవ్వాలని పాఠశాల యాజమాన్యం భీష్మించడంతో అధికారులు 2017లో భవనాన్ని కూడా నిర్మించారు. అయితే అది అసంపూర్తిగా ఉండిపోయింది. ఇప్పుడు ఆ భవన నిర్మాణానికి వుడా ముందుకు రావడంలేదు. దీంతో జీవీఎంసీ నిధులతో పూర్తి చేయాలని ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జీవీఎంసీ కమిషనర్‌ను కోరినట్టు తెలిసింది. జీవీఎంసీ నిర్మాణానికి సాంకేతికంగా అనుమతులు వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఆ భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో, గ్రౌండ్ అభివృద్ధి పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

### తొలినుంచీ ఇదే వరస

గాజువాక మున్సిపాలిటీగా ఉన్నప్పుడు వినాయక నగర్ వుడా కాలనీలోని మూడున్నరెకరాల స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి 1991లో తొలిసారిగా భూమిపూజ చేశారు. అనంతరం నిధులు లేవని వుడా చేతులెత్తేయడంతో ఆ పనులు శిలాఫలకంతోనే ఆగిపోయాయి. మళ్లీ దశాబ్దంన్నర తరువాత ఇందిరా ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్ (క్రీడా సముదాయం) పేరిట 2005 నవంబర్‌లో మరోసారి అదే మైదానంలో శంకుస్థాపన చేశారు. ఆ తరువాత జిల్లా మంత్రులు కూడా దీన్ని పరిశీలించి ఏదైనా పరిశ్రమ సహాయంతో దీని నిర్మాణం చేపట్టాలని భావించారు. ఈ నేపథ్యంలో దీనికి అవసరమైన రూ.4.50 కోట్ల నిధులను సామాజిక బాధ్యత నిధులనుంచి హెచ్‌పీసీఎల్ మంజూరు చేసింది. దీనిపై అధికారులనుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆ నిధులు కూడా పక్కకు పోయాయి. మళ్లీ దీని కథ మొదటికే వచ్చింది అనుకున్న సమయంలో గత ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ నుంచి రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈసారి కూడా అడ్డంకులు ఏర్పడటంతో పనులు నిలిచిపోయాయి.

### త్వరలోనే పనులను ప్రారంభిస్తాం

ఈ పనులను తిరిగి ప్రారంభించే విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నాం. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం. దసరా తరువాత పనులను తిరిగి ప్రారంభించే అవకాశం ఉంది.

– సౌజన్య, సహాయ ఇంజనీర్, జీవీఎంసీ, గాజువాక జోన్

# మహాలక్ష్మీ నమోస్తుతే..!



ధనలక్ష్మి అవతారంలో శ్రీమహాలక్ష్మి

**అగనంపూడి:** దుర్గాదేవి శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నరాడి. 85వ వార్డు అగనంపూడి దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో దుర్గాదేవి మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.68,255 నోట్లతో అలంకరించారు. శ్రీ బొర్రమాంబ పారాయణ సేవా సమితి విష్ణు, లలిత పారాయణం చేశారు. బొర్రమాంబ ఆలయ కమిటీ, దుర్గాలమ్మ ఆలయ కమిటీ సారధ్యంలో బుధవారం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ తెలిపారు. పెదమడక సూదికొండపై వెలిసిన శ్రీ మాతా దుర్గా భవానీ అమ్మవారి మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. రూ.90వేల నోట్లతో అలంకరింపజేశారు. 87వ వార్డు కణితి రజకవీధిలో శ్రీ రధాలమ్మ ఆర్‌జెఎస్ఎస్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో అమ్మవార్ని మహాలక్ష్మి అవతారంలో అలంకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు రమాదేవి దంపతులు దర్శించుకొని పసుపు కుంకుమలు సమర్పించారు. తరువాత అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో వాడ్రాసి వెంకటరావు, రమేష్, కోనేటి పారిపల్లి, మడక నరసింగరావు, సన్యాసిరావు, మురళీ, నాని, అప్పారావు, రమణ పాల్గొన్నారు.



అగనంపూడి: మహాలక్ష్మి అమ్మవారిగా..



పెదమడకలో మహాలక్ష్మి రూపంలో ..



కరెన్సీతో దుర్గాదేవి అలంకరణ



వాంబేకాలనీలో లక్ష్మీదేవి అవతారంలో..

### త్రిశక్తి అమ్మవార్ల విశేష అవతారాలు

**ఉక్కునగరం:** ఉక్కునగరం త్రిశక్తి దేవాలయంలో శ్రీమహాదుర్గ,శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి అమ్మవార్లు ఒకే మంటపంలో పూజలందుకుంటున్నారు. ఆరో రోజు మంగళవారం శ్రీమహాదుర్గ అమ్మవారు బంగారు వర్ణం చీరలో మహాలక్ష్మిదేవి అవతారంలో, శ్రీమహాలక్ష్మి అమ్మవారు గులాబీ వర్ణం చీరలో ధనలక్ష్మి అవతారంలో, శ్రీమహాసరస్వతి అమ్మవారు పసుపు వర్ణం చీరలో వాఘేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు ఫణిశర్మ నేతృత్వంలో ఉదయం అమ్మవార్లకు సామూహిక మణిద్వీప వర్ణార్చన (కలశపూజ), సహస్ర కలువ పుష్పార్చన చేశారు. సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.



ఉక్కు త్రిశక్తి ఆలయంలో మణిద్వీప వర్ణార్చనలో పాల్గొన్న మహిళలు

### రూ.2.50 లక్షలతో అలంకరణ

**అక్కిరెడ్డిపాలెం:** దుర్గాదేవి అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. 69వ వార్డు తుంగ్లాంలో మంగళవారం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ప్రతినిధులు అమ్మవారిని రూ.2.50 లక్షల కరెన్సీతో అలంకరించారు.

### నేత్రపర్వంగా శరన్నవరాత్రి మహోత్సవవాలు

**పెదగంట్యాడ:** మండలంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కనులు పండుగగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను మంగళవారం వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, కొల్లా అప్పలరాజు, మొగలపల్లి త్రిమూర్తులు, బొండాడ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### 65వ వార్డు వాంబే కాలనీలో..

జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబే కాలనీలో వేంచేసియున్న వైకుంఠ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా దర్గాదేవి అమ్మవారిని ధనలక్ష్మిగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి రమణ, మంత్రి మంజుల తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి బర్మా కాలనీలో దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా మంగళవారం భక్తులకు దర్శమిచ్చారు.